పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి. పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిరంతరాయంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. సోమవారం కురుమాల గ్రామ సచివాలయం పరిధిలోని కురుమాల, గంగాపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి నవరత్నాల్లోని పథకాల ద్వారా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందని తెలిపారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ముసుగులో ఆ పార్టీ నాయకులు ప్రజల సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు

ఆడపిల్లలు, మహిళల పట్ల వివక్ష తగదు. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను కూడా చూడాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హితవు పలికారు. కురుమాల గ్రామంలో ఐకేపీ వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన జెండర్ ప్రతిజ్ఞలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. లింగ వివక్ష లేని సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కురుమాలలో కే.అంజలీదేవి, రాజారెడ్డి దంపతులు నూతనంగా నిర్మించిన జగనన్న పక్కాగృహాన్ని ప్రారంభించారు. వారితో గృహ ప్రవేశం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగమూర్తి, ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, ఎంపీటీసీ మంజుల, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యుడు కే.రవిచంద్రారెడ్డి, నాయకులు పీవీ భాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్, అశోక్ రెడ్డి, రెడ్డెప్ప, గిరిజాపతి, కే.రాజారెడ్డి, హబీబుల్లా, మగ్దుంబాషా, శంకర, ఓబులప్ప, జైనుల్లా, మోహన్‌రెడ్డి, మోదీనమ్మ, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఏపీఎం జయంతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


మృతుడి కుటుంబానికి తక్షణ సాయం అందిస్తున్న దృశ్యం

తాడిమర్రి: అధైర్య పడకండి పార్టీ మీకు అండగా ఉంటుందని మండల సచివాలయాల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. స్థానిక ముస్లిం వీధిలో అనారోగ్యంతో మృతి చెందిన షేక్ జిలాన్‌బాషా (38) కుటుంబానికి సోమవారం వారు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల బీమా అందుతుందని తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ గృహసారథులకు పార్టీ రూ.10 లక్షల బీమా ప్రకటించిందన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డితో మాట్లాడి బీమా మొత్తం త్వరగా వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రిజ్వానాబేగం, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు పెద్ద ఓబిలేసు, బీసాని లక్ష్మన్న, కో–ఆప్షన్ సభ్యుడు బాబాఫక్రుద్దీన్, వలంటీర్ తలారి గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

తలుపుల: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఏపీఓ గోవిందు రాజుల నాయక్ తెలిపారు.

ఎన్‌పీకుంట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఉపాధిహామీ పథకం పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించిందన్నారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత


చికిత్స పొందుతున్న ఆదినారాయణ రెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఆదినారాయణరెడ్డి సోమవారం కాలనీ సమీపంలోని తోటలో వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆదినారాయణరెడ్డి కోలుకుంటున్నాడు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ


క్రీడాకారిణి సహస్రను అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి స్కూల్ ర్యాంకింగ్ చెస్ పోటీల్లో ధర్మవరం క్రీడాకారిణి సహస్ర రాణించిందని బీఎస్‌కే చెస్ అకాడమీ కోచ్‌లు ఆదిరత్న కుమార్, కిశోర్ కుమార్ తెలిపారు. పట్టణంలోని అకాడమీలో సోమవారం క్రీడాకారిణిని అభినందించారు. ఈనెల 26వ తేదీన అనంతపురంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో అండర్–12 విభాగం రాష్ట్రస్థాయి స్కూల్ ర్యాంకింగ్ పోటీలు జరిగాయన్నారు. సహస్ర 5 మ్యాచ్‌లకు గాను 4 మ్యాచ్‌లు గెలిచి రెండోస్థానంలో నిలిచిందన్నారు. క్రీడాకారిణి భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని కోచ్‌లు ఆకాంక్షించారు.

బహుమతుల ప్రదానం


విజేతలకు పట్టుచీరలు అందిస్తున్న డీఎం మోతిలాల్‌నాయక్

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందిస్తున్నామని ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం పట్టణ పట్టుచీరల వ్యాపారవేత్తలు మాంగళ్య సిల్క్స్ నిర్వాహకులు జింకా నాగభూషణం, జింకా గిరి, జింకా పురుషోత్తం ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రతినెలా ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ వస్తువులు తీసుకున్న వారికి లక్కీ డిప్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విజేతలు పోలా నాగలక్ష్మి, సిద్ధార్థ, మహేంద్ర, బాబాకు పట్టుచీరలు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, సెక్యూరిటీ హెడ్‌గార్డ్ రామంజినేయులు, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, డిపో కార్యదర్శి ముస్తఫా, ఏడీసీ అజీజ్, పీఏ స్ఖాన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కేఆర్ఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల హాకీ విజేత ధర్మవరం


క్రీడాకారులను అభినందిస్తున్న అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: ఎస్కే యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల గ్రూప్–సీ హాకీ పోటీల్లో ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించిందని ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం క్రీడాకారులను అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈనెల 23, 24 తేదీల్లో ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో గ్రూప్–సీ హాకీ పోటీలు జరిగాయన్నారు. ఆర్ట్స్ కళాశాల జట్టుపై ధర్మవరం కళాశాల జట్టు విజయం సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులు కెప్టెన్ రాజేష్, క్రీడాకారులు మద్దిలేటి, నాగరాజు, లోకేష్, శ్రీనివాసులు, ధనుష్, జ్ఞానేంద్రాచారి, ఓంశేఖర్, పోతిరెడ్డి, రాజు, విశ్వనాథ్, శ్రావణ్‌కుమార్, బాలాజీ, భానుప్రకాష్, దుర్గాప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ ఆనంద్, అధ్యాపకులు గోపాల్ నాయక్, చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, పావని, భువనేశ్వరి, పుష్పావతి, సౌజన్య, సరస్వతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు ప్రతిరూపం 'ఎన్‌సీసీ'


చెత్తాచెదారం తొలగిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: సేవలకు ప్రతి రూపమైన సేవా సైన్యంగా మంగళకర విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు కరస్పాండెంట్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మంగళకర పాఠశాలకు ఎన్‌సీసీ అనుమతి లభించిందన్నారు. మొదటి సారిగా పలువురు విద్యార్థులను ఎంపిక చేసి, సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. పాఠశాల నుంచి కొత్తచెరువు వెళ్లి అక్కడ ప్రభుత్వ ఆసుపత్రి, హోమియో వైద్యశాల, కళాశాల ప్రాంగణంలోని చెత్తాచెదారం తొలగించారు. ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఇందులో 38 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఆర్యాప్రకాష్, ప్రిన్సిపాల్ బిందుజా, ఎన్‌సీసీ సీటీఓ మహమ్మద్ ముదస్సార్, ఏఓ జయచంద్రారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, డాక్టర్ అశ్వర్థ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 10 వినతులు


ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అర్జీలు ఇస్తున్న మహిళలు

బత్తలపల్లి: మేము బత్తలపల్లిలో నివాసముంటున్నాం.. మాకు ఇళ్లు లేవు, ఇంటి స్థలాలు లేవు. మాకు ఇంటి స్థలాలు ఇప్పించాలంటూ పలువురు మహిళలు తహసీల్దార్ యుగేశ్వరిదేవికి మొరపెట్టుకున్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బత్తలపల్లికి చెందిన ఆరుగురు మహిళలు తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని అర్జీలు అందజేశారు. అలాగే భూ సమస్యలపై మూడు, సర్వే కోసం ఒక అర్జీ అందినట్లు తహసీల్దార్ వివరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమాన్ని ఎంపీపీ బగ్గిరి త్రివేణి పర్యవేక్షించారు. అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమానికి రావాల్సి ఉంటుందని చెప్పారు. అందరూ హాజరు కావాలని చెబుతున్నామని, కొన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదని తహసీల్దార్ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం శివానగర్ శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


బత్తలపల్లి శివాలయంలో ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న కోటి బాబు దంపతులు

● కార్తీక కాంతులు

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాల్లో సోమవారం కార్తీక సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని శివుడికి అభిషేకాలు, పూజలు చేయించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మవరం పట్టణంలోని శివానగర్ శివాలయం, తిక్కస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పూజలు చేయించారు. బత్తలపల్లిలోని ఓంకారేశ్వరుడి ఆలయంలో తొలుత శివలింగాకృతిలో వెయ్యి దీపాలు వెలిగించి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం ఆకాశదీపాన్ని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్, ఆలయ శాశ్వత ధర్మకర్తలు కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి వెలిగించారు. అలాగే ధర్మవరం, కొత్తచెరువు, తాడిమర్రి, తలుపుల, గాండ్లపెంట ఎన్‌పీకుంట, అమడగూరు, నల్లచెరువులో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. పలుచోట్ల భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

– సాక్షినెట్‌వర్క్:


తాడిమర్రి: పూజలందుకున్న పరమేశ్వరుడు


నల్లచెరువులోని మార్కండేయ ఆలయంలో పూజలు


ఎన్‌పీకుంట: శివాలయంలో..


తలుపుల: ఓబీఆర్ రోడ్డులోని శివాలయంలో..


అమడగూరు షిరిడీ సాయిబాబా ఆలయంలో దీపారాధన


ధర్మవరం చెన్నకేశవస్వామి ఆలయంలో..

నేడు కార్తీక వన భోజనాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం వద్ద మంగళవారం కార్తీక మాసం సందర్భంగా వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వివిధ కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్త్రీలు, పిల్లలకు ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కదిరిలోని విశ్వబ్రాహ్మణులందరూ తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ అల్తాఫ్ బాధ్యతల స్వీకరణ



తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన వైద్యాధికారిగా అల్తాఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. వైద్య సిబ్బంది సహకారంతో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తామని డాక్టర్ అల్తాఫ్ తెలిపారు.

తక్కువ వడ్డీకే రుణాలు



మాట్లాడుతున్న మేనేజర్ మహాలక్ష్మి

నల్లచెరువు: స్థానిక సహకార సంఘం కార్యాలయంలో సోమవారం సహకార సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రుణాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత కార్యాలయంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన తలారి ఆంజనేయులుకు సిబ్బంది సంతాపం తెలిపారు. సహకార సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకార సంఘాల ద్వారా రైతులకు నాణ్యమైన సేవలు అందజేస్తున్నారని తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా వచ్చే ఇన్సూరెన్స్ ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ మహాలక్ష్మి కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లికార్జున, సీఈఓ మల్లికార్జున రెడ్డి, సెక్రటరీలు లక్ష్మీపతి నాయుడు, శ్రీనివాసులు, పవన్ పాల్గొన్నారు.

చిగిచెర్లలో మెడికల్ క్యాంప్

ధర్మవరం రూరల్: చిగిచెర్ల, ఉప్పునేసినపల్లి పంచాయతీల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అధికారులు వివరించారు. ఆధార్, మెడికల్ క్యాంపులు నిర్వహించారు. జాతీయ స్థాయి జూడో పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన నందినిని సన్మానించారు. విద్యార్థినికి పీడీ ప్రతాప్‌రెడ్డి రూ.3 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌజన్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారిణి విద్యావతి, ఏడీఏ క్రిష్టయ్య, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన్ కేంద్రం రిసెర్చ్ శాస్త్రవేత్త ముత్యాలరావు, డిస్టిక్ ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణయ్య, మెడికల్ ఆఫీసర్ దిలీప్‌కుమార్, ఈఓఆర్డీ మమతా దేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ పాల్గొన్నారు.

అన్నదానం

ముదిగుబ్బ: ఏరీస్ అగ్రో లిమిటెడ్ ఎరువుల కంపెనీ 54 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రావా అగ్రి కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏరీస్ ప్రతినిధులు జయ ప్రదీప్, సుబ్రమనియన్, నాగేశ్వరావు, రాజశేఖర్, డీఎస్ నాయుడు, రమేష్, శ్రీనివాస్, పురుషోత్తం, వెంకటేష్, కుమారస్వామి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రెడ్డి కార్తీక వనభోజనాలు


వేదపండితులతో ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: స్థానిక కనుమ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు వేద పండితులతో కార్తీక దామోదర హోమం, గణపతి హోమం, రాజశ్యామల హోమం నిర్వహించారు. ఈ పుణ్య కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరై, వేదపండితుల ఆశీర్వాచనాలను అందుకున్నారు. అనంతరం రెడ్డి కులస్తులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అర్హులందరికీ పథకాలు


ప్రచారం చేస్తున్న కొత్తకోట సోమశేఖర్ రెడ్డి

కొత్తచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని పార్టీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొడపగానిపల్లిలో కుమారుడు చక్రధర్ రెడ్డితో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం తిరుమల దేవరపల్లి, కొత్తచెరువు, భైరవేశ్వర, సోమేశ్వర ఆలయాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, సాలమ్మగారి శివప్రసాద్ పాల్గొన్నారు.

మొదటి రోజే 51 రిజిస్ట్రేషన్లు

అమడగూరు: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు మొదటి రోజే వివిధ రకాల క్రీడల కోసం 51 దరఖాస్తులు వచ్చాయి. మండలంలోని 9 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు ఎంపీడీఓ మునెప్ప సోమవారం పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది బాధ్యతగా తీసుకుని పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు చేయించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మొదటి రోజే క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకు దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయన్నారు. ఖోఖో, కబడ్డీ, ఏదేని క్రీడల్లో నైపుణ్యం ఉన్నా సంబంధిత సచివాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

వరిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: బత్తలపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని గంటాపురం గ్రామంలో సోమవారం వరిలో పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. నాగతేజ సాగు చేసిన వరి పంటలో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి పర్యవేక్షణలో మండల గణాంకశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, వీహెచ్ఏ హసీనాబేగం ప్రభుత్వం నిర్దేశించిన కొలతల్లో పంటను తొలగించి ప్రయోగాలను నిర్వహించారు. ఈ కొలతల ప్రకారం 5 కేజీల 100 గ్రాముల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గాల ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న నల్లచెరువు కమిటీ సభ్యులు

తనకల్లు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎంపిక చేశారు. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా రాజారెడ్డి, అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శివశంకర్‌రెడ్డి, కొలిమి గౌసియా సుల్తానా, ప్రధాన కార్యదర్శిగా ఖాజామొహద్దీన్, కోశాధికారిగా బాబ్‌జాన్, జిల్లా మహాసభ ప్రతినిధిగా నరేంద్ర, ఆడిట్ కమిటీ సభ్యులుగా నూర్ఖాన్, హేమలత, రామాంజినేయులు, అబీదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, ఎన్నికల అధికారి తాహిర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: కదిరి ఎన్జీఓ హోంలో సోమవారం జిల్లా కోశాధికారులు శ్రీనివాసులు, తాహిర్‌వలి ఆధ్వర్యంలో నల్లచెరువు మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవివర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రమేష్‌బాబు, అరుణ, ప్రధాన కార్యదర్శి సంపత్, కోశాధికారిగా రఫీ, జిల్లా మహాసభ ప్రతినిధులుగా నజీర్ బాషా, వేణు, కార్యదర్శులుగా ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, రమేష్‌నాయక్, మహేంద్ర, మధుసూదన్, కన్వీనర్‌గా అంజాద్ బాష, సభ్యుడిగా వెంకటరామిరెడ్డిని ఎన్నుకున్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

కదిరి అర్బన్/తలుపుల/తనకల్లు/నల్లచెరువు/ఎన్‌పీకుంట/గాండ్లపెంట/బత్తలపల్లి: కదిరి మండల పరిధిలోని కదిరికుంట్లపల్లి, తలుపుల మండలంలోని లక్కసముద్రంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరగనుందని సర్పంచ్ తులశమ్మ, సుదర్శన్ రెడ్డి, కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్ తెలిపారు. తనకల్లు మండల పరిధిలోని చీకటిమానిపల్లి సచివాలయంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నల్లచెరువు మండలం కె.పూలకుంట సచివాలయంలో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీపీ రమణారెడ్డి, కన్వీనర్ హైదర్‌వలి, సర్పంచ్ యూసుఫ్ వెల్లడించారు. ఎన్‌పీకుంట మండలం గొకనపల్లి, గాండ్లపెంట మండలం సోమయాజులపల్లి సచివాలయంలో జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి హాజరవుతారని ఎంపీపీ ఈటె రాము, మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, గాండ్లపెంట మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మాల్యవంతం సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, మండల కన్వీనర్ జయరామిరెడ్డి తెలిపారు.

ఎస్టీయూ కమిటీల ఎన్నిక


నూతన కమిటీ సభ్యులతో ఎస్టీయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎస్టీయూ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ పాఠశాలలో ఎస్టీయూ నాయకులు ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, రాష్ట్ర కౌన్సిలర్ కోనంకి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. జిల్లా కౌన్సిలర్లుగా సంపత్‌కుమార్, నాగేంద్ర, శ్రీనివాసులు, పుట్టపర్తి మండలం గౌరవాధ్యక్షుడిగా నాగభూషణ, అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా వెంగమనాయుడు, బుక్కపట్నం మండలం గౌరవాధ్యక్షుడిగా రామచంద్రరాజు, అధ్యక్షుడిగా శంకర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, అలాగే కొత్తచెరువు మండలం అధ్యక్షుడిగా శివయ్య, ప్రధాన కార్యదర్శిగా రవిచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.